క్లుప్తంగా

రేపటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 10 వరకు పిల్లలు, మహిళలకు ఉచితంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, మహిళలకు డిజిటల్ ప్రింటింగ్ శారీస్, గ్లాస్ పెయింటింగ్, బ్లౌజెస్ మీద 3డీ పెయింటింగ్ శిక్షణ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఇస్తామని చెప్పారు. మురళీనగర్ బ్యాంక్ వీధి, డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కార్యాలయ ప్రాంగణంలో శిక్షణ జరుగుతుందని, ఆసక్తి గల వారు 79811 09279 నంబర్‌లో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

సూపర్‌స్టార్ కృష్ణకు సేవా నివాళి



ధ్యాన మందిరంలో అన్నదానం చేస్తున్న కృష్ణ అభిమానులు

తాటిచెట్లపాలెం: వెండితెర సూపర్‌స్టార్ కృష్ణ 83వ జయంతి వేడుకలు సీనియర్ అభిమాని కె.కమల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మధ్యాహ్నం భారీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణ అభిమానులు ఎస్.రవి, కేబుల్ శ్రీను, కె.స్వాతి, శ్రేయ ప్రాపర్టీస్ మార్కెటింగ్ డైరెక్టర్ టి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అంకెలతో ఆటలు



అంకెల్లో తమాషాను విద్యార్థులకు వివరిస్తున్న మూర్తి

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం అంకెలతో ఆటలు ఆడించారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు జి.ఎస్.ఎన్.మూర్తి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని అంకెల్లో ఇమిడి ఉన్న తమాషాలను విద్యార్థులకు వివరించారు. ప్రశ్నించడం అలవాటు చేసుకుంటే విశ్లేషణాత్మక శక్తి పెరిగి కొత్త విషయాలను నేర్చుకోవచ్చని చెప్పారు. నంబర్లతో ఉన్న చిత్రాలను ఊహించి చెప్పడం, వాటిని వివరించడంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చూసిన నంబర్లను గుర్తుపెట్టుకుని వరుస క్రమంలో చెప్పడం నేర్చుకున్నారు.

ఘనంగా లోకమాత జయంతి వేడుకలు

తాటిచెట్లపాలెం: బీజేపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో శనివారం లోకమాత పుణ్య శ్లోక అహల్యాభాయ్ హోల్కర్ 300 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ శ్రేణులు సురేష్‌బాబు, శ్యామలదీపిక, ధనేశ్వరరావు, శంకరరావు, అరుణ్‌బాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యూజీడీ లీకేజీతో అవస్థలు



గణేష్‌నగర్ శివాలయం వద్ద లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం వెనుక రోడ్డులో 50–79–5/2న ఇంటి నంబరు వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండటంతో నివాసులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో సిబ్బంది వచ్చి మ్యాన్‌హోల్‌లో పూడిక తొలగించి వెళ్లిపోతున్నారు. మళ్లీ రెండు రోజులకే ఎప్పటిలా యూజీడీ లీకవుతూ అవస్థలకు గురిచేస్తోంది. తరచూ మురుగు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోందని, దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పార్కింగ్‌తో పరేషాన్..!



80 ఫీట్ రోడ్‌లో వాహనాల పార్కింగ్‌తో ఇబ్బంది పడుతున్న పాదచారులు



నరసింహనగర్ రహదారిలో ఇరువైపులా వాహనాల పార్కింగ్

- ప్రధాన రహదారుల్లో ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత
- రద్దీ ప్రాంతాల్లో వేధిస్తున్న పార్కింగ్ సమస్య
- పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇక్కట్లు
- రాంగ్ పార్కింగ్ చలానాలు విధిస్తున్నా.. నియంత్రించలేని వైనం

సీతంపేట: స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో వాహనాల పార్కింగ్ సమస్య సవాల్‌గా మారింది. గతంతో పోల్చితే టూవీలర్‌తోపాటు ఫోర్ వీలర్ వాహనాల వాడుక సంఖ్య బాగా పెరిగింది. కరోనా సమయంలో ఆటోలు, బస్సుల్లో ప్రయాణించడానికి ఇష్టపడక సొంత వాహనాల వైపు ఎక్కువ మొగ్గు చూపారు. దీంతో చాలా మంది కార్లు కొనుగోలు చేశారు. విశాఖలో ప్రతి ఏటా లక్ష వాహనాలు కొత్తగా కొనుగోలు చేస్తున్నారు. పార్కింగ్ సదుపాయం లేకపోయినా వాహనాల కొనుగోళ్లతో రహదారులను యథేచ్ఛగా పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. నగరంలోని అపార్ట్‌మెంట్లలో నివసించే వారికి తప్ప.. గ్రూప్ హౌస్, ఇండివిడ్యువల్ హౌస్‌లో ఉండే వారికి చాలా వరకు పార్కింగ్ సదుపాయం లేదు. దీంతో కార్లు, బైకులు, ఇతర వాహనాలను ఇళ్ల ముందు రహదారిపై నిలుపుతున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి.

బారులు తీరుతున్న వాహనాలు

నగరంలోకి ప్రవేశించే ప్రధాన రహదారులైన సీతంపేట, అక్కయ్యపాలెం, శంకరమఠం రోడ్, 80 ఫీట్ రోడ్లలో సైతం నిత్యం వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపేయడంతో సగం రోడ్డు ఆక్రమణకు గురవుతోంది. దీనికి తోడు తోపుడు బళ్లు, చిరు వ్యాపారుల ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు, పాదచారులు నడవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి ఎంతో విశాలంగా నిర్మించిన రహదారులను వాహనాల పార్కింగ్‌తో ఆక్రమించేస్తున్నారు. హైవేపై సైతం వాహనాలను నిలిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. రాంగ్ పార్కింగ్‌పై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ నియంత్రించలేక పోతున్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, 80 ఫీట్ రోడ్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఐరన్, సిమెంట్, బియ్యం, ప్లేవుడ్, హార్డ్‌వేర్ హోల్‌సేల్ షాపులు, గొడౌన్లు ఎక్కువగా ఉన్నాయి. వాటికి సరకులు, సామగ్రి తెచ్చే భారీ లారీలు, కంటైనర్లు ఈ మార్గాల్లో ప్రవేశించి ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నాయి. హోల్‌సేల్ వ్యాపారుల నుంచి రిటైలర్స్‌కు సరకులు పంపిణీ చేసే వాహనాలు, వ్యాపార సంస్థల యజమానుల వాహనాలు రహదారులపై పార్క్‌చేస్తున్నారు. దీంతో విశాలంగా ఉండాల్సిన రహదారులు సగానికి పైగా కుచించుకుపోతున్నాయి. వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. మెరుగైన రవాణా వ్యవస్థ కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన రహదారులు అక్రమ పార్కింగ్‌లతో ఇబ్బందుల పాలు చేస్తున్నారు. స్మార్ట్ సిటీగా ఎదుగుతున్న విశాఖలోని రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపై పార్కింగ్‌తో ఇబ్బందులు



సీతంపేట, శంకరమఠం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్లపై కార్లు, వ్యాన్లు పదుల సంఖ్యలో పార్క్‌చేస్తున్నారు. ప్రజా రవాణా కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన రహదారులు పార్కింగ్ కేంద్రాలుగా మారాయి. రోడ్లు ఇరుగ్గా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలి.

– వి.గౌరీశంకర్, అక్కయ్యపాలెం

సెల్లార్లలోకి వాహనాలు అనుమతించరు



సీతంపేట, అక్కయ్యపాలెం, శంకరమఠం ప్రధాన రహదారుల్లోని బహుళ అంతస్తుల భవనాల్లో వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్నారు. వినియోగదారుల వాహనాలను సెల్లార్‌లో పార్కింగ్‌కు అనుమతించడం లేదు. దీంతో వారు రోడ్లపై నిలుపుతున్నారు. అధికారులు స్పందించి పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– టి.సంతోష్, సీతంపేట



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో నిలిపిన భారీ వాహనం



శంకరమఠం రోడ్డులో నిషేధిత సమయంలో అన్‌లోడ్ చేస్తున్న లారీ



శంకరమఠం రోడ్డులో నిలిపిన వాహనాలు

గెడ్డ పనుల పరిశీలన



గెడ్డ పనులపై అధికారులకు సూచనలిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులో శనివారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు పర్యటించారు. మాణిక్యాంబ కాలనీలో జరుగుతున్న గెడ్డ రక్షణ గోడ, బాటం కాంక్రీట్ పనులను పరిశీలించి, అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. వాహన చోదకులు ఇబ్బందులు పడుతుండటంతో సీసీ రోడ్లు వేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశామన్నారు. ప్రస్తుతం గెడ్డకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్, బాటమ్ కాంక్రీట్ నిర్మాణాలు చేయడం ద్వారా వర్షా కాలంలో ఎటువంటి ఇబ్బందులు రావని, నీటి ప్రవాహానికి ఈ రక్షణ గోడ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. నిర్మాణ సమయంలో కార్మికులకు, సంబంధిత అధికారులకు స్థానికులు సహకరించాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో వార్డు ఏఈ భాను, నాగేంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ అయినింటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి విశేష సేవలు



సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరుడికి తిరుపతి తరహాలో జేష్ఠమాసం తొలి శనివారం నుంచి విశేష సేవలు ప్రారంభించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, తోమాల సేవ, అర్చన అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 5 గంటలకు అర్చన, విష్ణు సహస్రనామ పారాయణ, గోవింద నామాల పారాయణ, నక్షత్ర హారతి ఇచ్చారు. అనంతరం 8.15 గంటలకు కల్యాణ వెంకటేశ్వర స్వామికి క్షీర నివేదన, పవలింపు సేవ నిర్వహించారు. ఇకపై ప్రతి శనివారం ఆయా సేవలు జరుగుతాయని, భక్తులు పాల్గొని తరించవచ్చని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పవలింపు సేవలో దంపతులిద్దరిని అనుమతిస్తామని, సేవలో పాల్గొన దలచిన వారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నయవంచనలో చంద్రబాబు దిట్ట




వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు. తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు తదితరులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 4న 'వెన్నుపోటు దినం' విజయవంతానికి సిద్ధం కావాలని పిలుపు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్యని, దానినే అస్త్రంగా చేసుకుని ఎన్నికల్లో అమలు కానీ హామీలిచ్చి ప్రజలను నమ్మబలికి నయవంచనకు పాల్పడ్డారని, దానిపై వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినం పేరుతో పోరాటం చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. సీతమ్మధారలోని పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్లతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం.. ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో దగా చేసి వెన్నుపోటు పొడిచిందన్నారు. అమలు కాని సూపర్ 6 పథకాలతోపాటు 150కి పైగా హామీలతో రాష్ట్ర ప్రజలను నమ్మబలికి, వారి ఓట్లతో గద్దెనెక్కి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఇలాంటి దగాకోరు, రాక్షస ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా ప్రకటించారన్నారు. ఆయన పిలుపు మేరకు ప్రతి నియోజకవర్గంలో ఈ నెల 4న వెన్నుపోటు దినం పేరుతో నిరసన తెలిపేందుకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని కె.కె.రాజు కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు ఉమ్మిడి స్వాతి, మొల్లి లక్ష్మి, ముువ్వల లక్ష్మి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు అక్కరమాని మంగరాజు, పల్లా దుర్గారావు, నడింపల్లి కృష్ణంరాజు, రవిరెడ్డి, ఉమ్మిడి దాసు, రామన్న పాత్రుడు, బోణి శివ రామకృష్ణ, అల్లంపల్లి రాజబాబు, పేర్ల విజయచందర్, గొలగాని శ్రీనివాస్, పీతల గోవింద్, శ్రీను, సత్యాల వెంకట్, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, మదుపాడ రవి, సూర్యనారాయణ, దేవరకొండ మార్కండేయులు, పీలా ప్రేమ్, సూర్యనారాయణరెడ్డి, సాగరిక, చొక్కర శేఖర్, చొల్లంగి నాగేశ్వరరావు, సంపంగి సురేష్, రాంప్రసాద్, యనమరెడ్డి కుమార్‌రెడ్డి, కన్నబాబు, భవానీశంకర్, శ్రీనివాసరెడ్డి, ఈశ్వరరావు, మక్బూల్, ఇమంది సత్యనారాయణ, జాన్ విక్టర్, రావాలు, గణేష్, మధుసూదనరెడ్డి, పోలిరెడ్డి, గణేష్‌రెడ్డి, రమణరెడ్డి, వాసు పాల్గొన్నారు.

హామీలను గాలికొదిలేశారు..



'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ నాయకులు

మర్రిపాలెం: కూటమి ప్రభుత్వ నయవంచనపై 'వెన్నుపోటు దినం' పేరుతో జూన్ 4న వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమ పోస్టర్‌ను శనివారం పార్టీ 53వ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు లేనిపోని హామీలిచ్చి, వాటిని గాలికొదిలేసి ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా.. ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబు చేసిన అరాచకాలు, అన్యాయాలపై చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జు వెంకటరెడ్డి, షేక్ బాబ్జి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీకాలనీ: ఓ వ్యక్తి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ముువ్వల అప్పలరాజు అనే వ్యక్తి ఎంవీపీ కాలనీ సెక్టార్–9లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, క్రెడిట్ కార్డ్ బిల్లుల కారణంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నెల 29న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లభించ లేదు. అప్పలరాజు భార్య సుజాత చేసిన ఫిర్యాదు మేరకు శనివారం ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని హెచ్‌సీ వరహాలు కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు



వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న సీఎంవో నరేష్‌కుమార్

ఆరిలోవ: జీవీఎంసీ వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ సీఎంవో డాక్టర్ ఇ.ఇన్.వి.నరేష్‌కుమార్ సమక్షంలో సిబ్బంది 12వ వార్డు పెదగదిలి కూడలిలో వీధి కుక్కలను పట్టుకుని వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా సీఎంవో మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో 52 కుక్కలను పట్టుకుని టీకాలు వేసినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వార్డుల్లోనూ వ్యాక్సినేషన్ చేపడతామన్నారు. కుక్క కాటుకు గురైన ప్రజల కోసం అన్ని పీహెచ్‌సీల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్‌కుమార్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఈకార్వో సమ్మర్ క్యాంప్



చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా, ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో ఏప్రిల్ 23 నుంచి అనుగార్ మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ శనివారంతో ఘనంగా ముగిసింది. చిన్నారులకు కరాటే, యోగా, కాలీగ్రఫీ, డ్రాయింగ్, చెస్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, కీబోర్డు, వోకల్ మ్యూజిక్, డ్యాన్స్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది ప్రత్యేకంగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టైలరింగ్ క్లాసులు కూడా మహిళల కోసం ప్రవేశపెట్టారు. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా నేతృత్వంలో రైల్ క్లబ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ ఏడాది రైల్వే ఉద్యోగులు, సాధారణ ప్రజల పిల్లలు కూడా కలిసి క్యాంప్‌లో పాల్గొన్నట్లు జ్యోత్స్న బోరా తెలిపారు. చిన్నారులకు బాల్యం నుంచి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ప్రతిభను వెలికితీయవచ్చని ఆమె అన్నారు. ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ అంకితశర్మ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ దరి తెన్నేటినగర్ పంప్‌హౌస్ సమీపంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన జరిగింది. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 49, 50 వార్డుల్లో విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టడానికి రూ.3.5 కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మురళీనగర్‌లో 5 ఎంవీఏ ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా తెన్నేటినగర్, బ్యాంక్ స్ట్రీట్, హరితా పార్కు చుట్టుపక్కల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా, వోల్టేజ్ సమస్యలను చెక్ పెట్టవచ్చన్నారు. ఈపీడీసీఎల్ అధికారులు త్వరలోనే సబ్‌స్టేషన్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తారన్నారు. వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, టీడీపీ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఎస్ఈ జి.శ్యామ్‌బాబు, జోన్–2 ఈఈ బీకే నాయుడు, డీఈఈ శివసత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

- కార్యక్రమంలో భాగంగా సౌర విద్యుత్‌పై అవగాహన పోస్టర్‌ను ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆవిష్కరించారు. మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజనా పథకాన్ని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ ఇంటిపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఇంటికి సరిపడా విద్యుత్‌ను ఉపయోగించుకోవచ్చని, విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని చెప్పారు.

మట్టిలో మాణిక్యాలకు అండగా ఉంటాం



టెన్త్ టాపర్ హర్షిణికి నగదు బహుమతి అందిస్తున్న ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ప్రతినిధులు

మురళీనగర్: నిరుపేద కుటుంబంలో పుట్టి విశేష ప్రతిభ చూపే మట్టిలో మాణిక్యాలకు అండగా నిలుస్తామని మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఉపాధ్యక్షురాలు ఉప్పలపాటి శుభ తెలిపారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో చదివి టెన్త్‌లో 587 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంకర్‌గా నిలిచిన ఎస్.హర్షిణికి పార్కు ప్రతినిధులు శనివారం రూ.15,000 ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హర్షిణి నిరుపేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన హర్షిణి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన పాలిసెట్‌లో ఎటువంటి కోచింగ్ లేకుండానే 1000 ర్యాంకు సాధించిందని తెలిపారు. బాలిక చదువుకు అవసరమైన సంపూర్ణ సాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా హర్షిణిని సత్కరించి నగదు బహుమతితో పాటు పెన్నులు, నోట్ పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమానికి చేయూతనిచ్చిన పి.నాగరాజు, కిన్నెర ఆనంద్, వై.త్రినాథ్, జి.విజయ్‌కుమార్, జి.సునీత, కె.లక్ష్మీనారాయణ, ప్రజాపతి, జి.వి.రత్నం, కె.బిందురాణి, ఉప్పలపాటి సుభ, చిరంజీవులు, యు.సుకీర్త్ వర్మ, యు.సమన్విత పాల్గొన్నారు.